RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 146

శనివారం
మే 03, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



దిగివస్తున్న బంగారం ధర

4లో..




# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇండ్లు అందజేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణ రావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు



తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా కూడా రద్దు చేస్తామన్నారు. లిస్ట్-1, లిస్ట్-2, లిస్ట్-3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.

### 5 నుంచి 20వ తేదీవరకు

గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీ వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో

మిగతా 4వ పేజీలో..



అంతర్జాతీయంగా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా

# మిస్ వరల్డ్ పోటీలు

- మిస్ వరల్డ్ పోటీలతో తెలంగాణ రైజింగ్ ఊత..
- హైదరాబాద్‌లో మే07 నుంచి 31 వరకు వేడుకగా పోటీలు
- తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటక, ఆధ్యాత్మిక, మెడికల్, సేఫ్టీ టూరిజంపై ఫోకస్...
- ప్రపంచానికి తెలియజేసేలా కార్యక్రమాలు, ప్రణాళికలు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మే 10 నుండి 31 వరకు హైదరాబాద్ వేదికగా జరగనున్న 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలను తెలంగాణ ప్రత్యేకతలను ప్రపంచానికి తెలిపేలా, అంతర్జాతీయంగా తెలంగాణకు బ్రాండ్ ఇమేజ్ పెంచేలా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేసింది. మిస్ వరల్డ్ పోటీలను సువర్ణ అవకాశంగా మలుచుకొని పెద్ద ఎత్తున పెట్టుబడులు తెలంగాణకు ఆకర్షించేలా ప్రయత్నాలు చేస్తుంది.

"ప్రపంచం కళ్లన్నీ తెలంగాణవైపే!" అనే స్లోగన్ తో ఈ ఈవెంట్ రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలవనుంది. ఈ నెల 2 నుంచి 8 వ తేదీ మధ్య వరకు మిస్ వరల్డ్ పోటీల కంటెస్టెంట్లు హైదరాబాద్ కు రానున్నారు.సుమారు 120 దేశాల నుండి కంటెస్టెంట్ లు, ఈ మేగా ఈవెంట్ లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటక ఆకర్షణలు, మెడికల్, సేఫ్టీ టూరిజం, తెలంగాణ గ్రోత్ స్టోరీ, ఇతర ప్రత్యేకతలు ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక థీమ్స్, టూరిస్ట్ సర్క్యూట్లు రూపొందించారు.

చైర్‌పర్సన్, సీఈవోజూలియా ఎవెలిన్ మోర్లీ కి ఘన స్వాగతం మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా శుక్రవారం హైదరాబాదులోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్పర్సన్, సిఈఓ శజూలియా ఎవెలిన్ మోర్లీ, మిస్ వరల్డ్ అధికారిణి కెర్రీ, అధికారులకు భారతీయ సంప్రదాయంలో ఘన స్వాగతం పలికారు.



## కుల గణన రాహుల్ గాంధీ ఆలోచన

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి దిక్సూచిగా నిలిచిందని, ఎఐసిసి నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర లో కులగణన పై ప్రకటన చేసిన తరువాతనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులగణన పై నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ ఆలి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు కులగణనపై కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి అనుకూలంగా కేంద్రం స్పందించిన సందర్భంగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి నాయకులు, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంఛార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి చిత్రపటాలకు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో

మిగతా 4వ పేజీలో..




**ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయి..**

**- వెంకటేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

**కొత్త రేషన్ కార్డుల జారీకోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తహసీల్దార్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఇంటి వద్దకు వచ్చే రెవెన్యూ సిబ్బందికి దరఖాస్తుదారులు వాస్తవంతో కూడిన సమాచారం అందించాలి. తప్పుడు సమాచారమిస్తే కార్డులు ఇవ్వకపోగా బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అనర్హులు స్వచ్ఛందంగా వారి కార్డులను అధికారులకు సరెండర్ చేయాలి.**

# కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయి..!

- రేషన్‌కార్డుల మార్పులు, చేర్పులకు అవకాశం
- ప్రారంభమైన క్షేత్రస్థాయి విచారణ
- నిరుపేదల నిరీక్షణకు ఎట్టకేలకు మోక్షం.

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

కొత్త రేషన్ కార్డుల జారీపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మోక్షం కలిగించింది. అర్హులందరికీ కార్డులు అందించాలని నిర్ణయించింది. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న కార్డుల్లోనూ మార్పులు, చేర్పులకు సైతం అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రజాపాలన, మీ సేవ కేంద్రాల ద్వారా అందిన దరఖాస్తులను ఇప్పటికే సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. జిల్లాలో న్యూ రేషన్ కార్డులు దరఖాస్తులను గ్రామీణ ప్రాంతాల్లో రెవిన్ ఇన్స్పెక్టర్లు ఇంటింటికి తిరిగి అర్హులను గుర్తించే పనిలో నిమగ్నూర్లయారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల వివరాలతో పాటు, వారి సమగ్ర సమాచారం సేకరిస్తూ ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరలోనే వారికి కొత్త అవకాశముంది. జిల్లాలో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. కొత్త కార్డులు జారీ చేయకపోవడంతో పాటు ఉన్న వాటిలోనూ కొత్తగా సభ్యుల పేర్లను చేర్చకపోవడం, వివరాల మార్పులకు సైతం అవకాశం ఇవ్వకపోవడంతో కొత్తగా పెళ్లి చేసుకుని అత్తారింటికి వచ్చిన మహిళలు, పుట్టిన పిల్లల పేర్లు కార్డుల్లో నమోదుకు నోచుకోలేదు. ఇలాంటి వారికి కూడా అవకాశం కల్పించడంతో వాటికి కూడా పెద్దఎత్తున దరఖాస్తులను పౌరసరఫరాల వెబ్సైట్ కు పంపడం జరిగింది.

### క్షేత్రస్థాయి విచారణ షురూ

ప్రజాపాలన, మీసేవ కేంద్రాల ద్వారా రేషన్‌కార్డుల కోసం

మిగతా 4వ పేజీలో..



## పద్మశాలీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

**వేద న్యూస్,శాయంపేట:**

పద్మశాలీలు అన్ని రంగాలలో రాణించాలని, రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం నాడు భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం(టిఆర్పిఎస్) శాయంపేట మండల అధ్యక్షుడు సామల మధుసూదన్ అధ్యక్షతన మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి, మలి దశ పోరాటాల్లో కీలక పాత్ర పోషించడంతో పాటు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే అన్నారు. శాయంపేట మండల కేంద్రంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అన్ని గ్రామాల నుండి పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

- ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బండారి రమేష్

**వేద న్యూస్, నల్లగొండ :**



బాల్యవివాహాలను అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు బండారి రమేష్ అన్నారు. శుక్రవారం కనగల్ మండలంలోని ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో, నల్లగొండలోని రామాలయం గుడి నందు మత పెద్దలను కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అశ్విత స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ రమేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు అమ్మాయికి, 21 సంవత్సరాల లోపు అబ్బాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరం అని తెలిపారు. అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. మత పెద్దలు ఆంజనేయులు శర్మ, శివకుమార్ శర్మ, భగవాన్ శర్మ, పవన్ శర్మ, మహిళలు పాల్గొన్నారు.

## కేసీఆర్ కళాభారతి పేరులో కేసీఆర్ పేరు తొలగింపు

4లో..

# అన్నదాతల బలవన్మరరణాలను ఆపలేమా?

**– యర్రం వెంకటరెడ్డి**

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

అన్నదాత (రైతన్న) లెక్క చూస్తే నాగలి కూడా మిగలదని ఒక నానుడి. విత్తు నాటడం నుంచి వచ్చిన దిగుబడిని మార్కెట్ కు తీసుకువెళ్లడం వరకు రైతుకయ్యే ఖర్చులకు, పంట అమ్మిన తర్వాత,వచ్చే సొమ్ముకు,పొంతన లేకుండా పోతుందని, దీనితో రైతన్న బల్వన్మరణాలకు పాల్పడుతున్నాడని భారతీయ కిసాన్ సంఘటన జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పంట అమ్మిన తర్వాత వచ్చే సొమ్ములకు పెట్టిన ఖర్చులకు పొంతన ఉండదు అనేదానికి అంతరార్థం అప్పులే, తప్ప ఆదాయాలు లేవని, అంతరార్థం. అప్పులే తప్ప ఆదాయాలు లేవని అన్నదాతల బతుకులలో చీకట్లు రోజురోజుకు దట్టమవుతున్నాయని అన్నారు. చిన్న సన్నకారు రైతుల కష్టాలు అయితేమరీ చెప్పనలవి కాకుండా ఉన్నాయని, చీడపీడల దాడులు, ప్రకృతి విపత్తుల తో సర్వం కోల్పోతున్న సాగుదారులను మార్కెట్ మాయాజాలాలు నిలువు నా ముంచెత్తుతున్నాయని రేయింబవళ్లు అరిగోశపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని సాగు, కుటుంబ అవసరాల కోసం, తీసుకున్న రుణాలను చెల్లిస్తే మిగిలేది శూన్యమని దారి కనబడడం లేదని ఆ నిస్సహాయ పరిస్థితులలో భవిష్యత్తు మీద ఆశ చచ్చిపోయి బలహీన క్షణాల్లో సొంత పొలాలలోనే చెట్టుకొమ్మలకు ఉరివేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులంతా అందరికీ అన్నం పెట్టే వారే కానీ వారు ఇప్పుడు పురుగుల మందు తాగుతున్నారని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి బల్వన్మరణాలను నివారించడంలో వ్యవస్థాగత వైఫల్యం భారతావని ప్రగతి ప్రస్థానంలో ఒక విషాద అధ్యాయం అని అన్నారు.



రైతుల ఆత్మహత్యలు కొత్తేమీ కాదని ఎన్నో సంవత్సరాలుగా వారు చనిపోతూనే ఉన్నారు. అని రెండు సంవత్సరాల క్రితం మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అబ్దుల్ సత్తార్ నాలుక చప్పరించారని పండించే వారు లేకపోతే పాలించే వారికి అన్నం పుట్టదన్న సంగతిని గుర్తించలేని నాయకుల మాటలలో అమానవీయతే తప్ప బాధ్యత ఎందుకు ధ్వనిస్తుందని అన్నారు. అలాంటి నేతలు రాజ్యం ఏలుతున్న చోట రైతన్నల పరిస్థితి ఏం బాగుంటుంది అని ప్రశ్నించారు. మహారాష్ట్రలోని చత్రపతి శంభాజీ నగర్ డివిజన్ పరిధిలో 2025 జనవరి నుంచి మార్చి మధ్యకాలంలో 269 మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు తాజా అధికారిక లెక్కలు చెబుతున్నాయని గత సంవత్సరం ఇవే మూడు నెలల్లో ఆ ప్రాంతంలో నమోదు అయిన రైతుల ఆత్మహత్యలు 204 అయితే ఏడాది తిరిగేసరికి అక్కడ సాగుదారుల మరణాలు 32 శాతం పెరిగాయి అంటే వ్యవస్థ ఉన్నట్లా? చచ్చుబడినట్లా? అని ప్రశ్నించారు 2024లో మహారాష్ట్ర మొత్తం మీద 2635 మంది రైతులు కడతేరిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ నేర గణాంక సంస్థ నివేదికల ప్రకారం దేశవ్యాప్తంగా గంటకు ఒక రైతో, రైతు కూలీనో, ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, ఆపత్కాలంలో భీమా ఆపన్న హస్తం అందక కొందరు వైపరీత్యాలలో కొట్టకపోయిన పంటలకు సకాలంలో పరిహారం అందక మరికొందరు నకిలీ విత్తుల విచ్చుకత్తుల దాటికి, ఇంకొందరు శ్రమకు తగిన ఫలితం రాక, మరెందరో రైతులు గుడ్ల నీరుకుక్కుకుంటున్నారని అన్నదాతల కంట కన్నీటి గంగా ఉభకడం దేశ ఆహార భద్రతకే ప్రమాదకరం అన్నారు. ప్రభుత్వాలు వివిధ సర్కారీ విభాగాల నిర్ణయాలు సాగుదారుల సామాజిక అస్తిత్వం ఆర్థిక మనుగడను నియంత్రిస్తుంటాయి. సాంఘిక ఆర్థిక అభివృద్ధి ఫలాలు పేదలకు అందడంలో వైఫల్యం మూలంగానే రైతులు ఆత్మహత్యలు ఇంత ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. సర్కారీ విధానాలలో తగినంతగా రక్షణ లభించకపోవడం వల్ల ప్రకృతి విపత్తుల పర్యవసానాలు రైతులకు ప్రాణాంతకంగా మారుతున్నాయని అన్నారు. అన్నదాతల బలన్మరణాలు నిరోధించడానికి ఉద్దేశించిన కార్యకరణ ప్రణాళికల అమలు సైతం కాగితాలకే పరిమితం అవుతుందని మద్దతు ధరలను నిర్ణయించడంలో శాస్త్రీయత అవసరమన్న స్వామినాథన్ సిఫార్సులకు చెదలు పట్టిపోయాయా? ఇలాంటి దయనీయ స్థితిలో సామాన్య రైతు బతికేది ఎలా? అని ప్రశ్నించారు.

**– రైతు జీవితాలతో ఆటలాడుకోవద్దు**

మధ్య దళారీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించివేస్తామని రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని పదేపదే వల్లిం చే నేతలు గిట్టుబాటు ధర విషయంలో మాత్రం ఏమీ చేయలేకపోతున్నారని చెప్పవచ్చు అన్నారు. కొన్ని ప్రయత్నాలు జరిగాయి కొత్త కొత్త విధానాలు రూపొందించారు. చట్టాలు తెచ్చారు. ముఖ్యంగా నల్ల బజార్లకు సరుకు తరలించి కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఫలితం శూన్యం అన్నారు. రైతులే తమ పంటలను నేరుగా అమ్ముకునే విధంగా రైతుబజార్ల రూపకల్పన చేశారు అని అన్నారు.ఆనాడు పెద్ద అట్టహాసంగా వీటిని ప్రారంభించారు. కనీసం కూరగాయల రైతులకైనా ఇవి ఉపయోగపడతాయని అందరూ ఆశించారు ప్రకటనలు చేయడం ప్రారంభోత్సవాలు చేయడంతో ఉన్న శ్రద్ధ వాటిని అమలు చేయడంలో చూపలేకపోతున్నారు. ఫలితంగా అవి కూడా దళారుల పాలిట కలపతరువులుగా మారిపోయాయి ఏదో ఒక సమస్య అయితే పోరాడవచ్చు, తట్టుకోవచ్చు, భరించవచ్చు, కానీ విత్తే దగ్గర నుంచి విక్రయించే వరకు అన్ని సమస్యలే అని అన్నారు. ప్రకృతి సృష్టించే బీభత్సాన్ని కొంతవరకు తట్టుకోగలం వరదలు కరువులతో వచ్చే నష్టాలను భరించగలం కానీ తోటి మానవుడు చేస్తున్న మోసాలను దగాను మోయలేక పోతున్నాడు రైతు అని అన్నారు. పెట్టుబడి అంతా పెట్టి చేయవలసిన శ్రమంత చేసిన తరువాత పంట వస్తుందన్న దశలో ఆ విత్తనం నకిలీదో నాసిరకందో అని బయటపడడంతో ఎందరో రైతులకు కుప్పకూలిపోతున్నారని ఆ దశలో ఏం చేయాలో తెలియక అప్పుల వాళ్ళ ముందు ఆత్మాభిమానం చంపుకుని జీవించలేక నిస్సహాయంగా ఆత్మహత్యల వైపు మొగ్గు చూపుతున్నారని ఏది ఏమైనా వ్యవసాయ రంగంలో సమగ్రమైన మార్పులు తీసుకువచ్చి లాభదాయకంగా రూపొందించకపోతే అన్నదాతలను ఈ చావుల నుండి కాపాడ లేమని వెంకటరెడ్డి అన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలి

**వేద న్యూస్,నడికూడ :**




నడికూడ మండల కేంద్రంలో అభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ని కోరారు. మండల కేంద్రంలో గత ప్రభుత్వం ప్రజల సౌలభ్యం కోసం 33 జిల్లాలను ఏర్పాటు చేయగా పరకాల నియోజకవర్గంలో కొత్తగా నడికూడ మండలాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం నడికూడ మండలాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.మండల కేంద్రానికి 14 గ్రామ పంచాయతీల ప్రజలు రాక పోకలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డబుల్ రోడ్డు మంజూరు చేశారని తెలిపారు. రోడ్డు వెడల్పులో ఇరువైపులా ఇండ్లు కోల్పోయిన బాధితులకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి 66 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సాంక్షన్ చేయడం జరిగిందన్నారు. వీరిలో పది మంది ఇండ్లు కట్టుకున్న వారికి డబ్బులు కూడా మంజూరయ్యాయి. మిగతా 55 ఇండ్లు ఆర్థిక పరిస్థితుల వల్ల నిర్మించలేదు. ఇండ్లు నిర్మించుకునే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో బిల్లులు మంజూరు కాలేదు. దీనితో ప్రభుత్వం మారడం వల్ల వాటిని నిలిపివేశారు. ఇండ్లు కోల్పోయిన బాధితులు అద్దె ఇండ్లలో తలదాచుకుంటున్నారు. మండల అభివృద్ధికి సహకరించి ఇండ్లు కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అండగా ఉండి, వెంటనే స్పందించి ఇందిరమ్మ ఇండ్లలో మొదటి విడత ఇండ్లు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు కోరారు.



– మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు..

# ఎస్.ఎస్.సి ఫలితాల్లో సిల్వర్ క్రౌన్ హై స్కూల్ విద్యార్థుల జయకేతనం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




వరంగల్ నగరంలోని రంగశాయిపేట తిమ్మాపూర్ క్రాస్ వద్ద గల సిల్వర్ క్రౌన్ హై స్కూల్ విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ కూచన కవిత తెలిపారు. మొత్తం 600 కు గాను సిహెచ్ అభినవ్ 558, సిహెచ్ నక్షత్ర 549, వి మణిదీప్ 543, పి సుస్మిత 540, అలాగే ఇంకా 9 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 100కు 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మా పాఠశాలలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు విశాలమైన ఆట స్థలాలు, డిజిటల్ క్లాస్ రూమ్ లు, నిరంతర పర్యవేక్షణతో విద్యార్థుల నైపుణ్యాలు పెంచుతున్నట్లు తెలిపారు. విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు మరియు పోటీ పరీక్షలలో సైతం రాణించేలా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఫలితాలు రావడానికి కారణమైన పాఠశాల అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వడిచర్ల ప్రసాద్ మరియు బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దిగివస్తోన్న బంగారం ధర

**వేద న్యూస్,**



నింగికంటిన బంగారం ధరలు క్రమంగా దిగివస్తోన్నాయి. అమెరికా, చైనా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం సహా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగియనుందనే అంచనాలు పసిడి తగ్గుదలకు దోహదం చేస్తోన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,160 తగ్గి రూ.95,880కి దిగివచ్చింది. గుడ్‌రిటర్న్ సమాచారం ప్రకారం.. 22 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,000 దిగివచ్చి రూ.87,900గా పలికింది. 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. ఇటీవల తులం బంగారం ధర రూ.1 లక్ష దాటిన విషయం తెలిసిందే. కిలో వెండిపై రూ.2,000 తగ్గి రూ.98,000గా నమోదయ్యింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర దిగివస్తోంది. ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద నమోదయ్యింది. ఆల్‌టైం గరిష్ట స్థాయి 3,500 డాలర్ల నుంచి నుంచి 7 శాతం మేర తగ్గి 3,232 వద్ద పలికింది. ప్రపంచ మార్కెట్‌లో గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర దాదాపు 40 శాతం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు డాలర్ విలువ బలపడుతుండటం కూడా పసిడి ధర తగ్గడానికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, ట్రంప్ టారిఫ్‌లు, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు తదితర అంశాలు బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. నింగికంటిన బంగారం ధరల వల్ల ఈ ఏడాది జనవరి మార్చి త్రైమాసికంలో భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) బుధవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ మూడు నెలల కాలంలో బంగారం అమ్మకాలు 118.1 టన్నులకు పడిపోయాయి. పెట్టుబడుల డిమాండ్ మాత్రం 7 శాతం పెరిగి 46.7 టన్నులుగా చోటు చేసుకుంది. ఇదే సమయంలో అభరణాల డిమాండ్ ఏకంగా 25 శాతం క్షీణించి 71.4 మెట్రిక్ టన్నులకు క్షీణించింది. 2009 తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

**– ఆశా వర్కర్ల కు కనీస వేతనం ఇవ్వాలి**



**వేద న్యూస్,దామరచర్ల :**

మే నెల 20వ తారీఖున జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా శుక్రవారం ఉదయం ఆశా వర్కర్లు దామరచర్ల మండల కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ కి సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దయానందు,సిపిఎం మండల కార్యదర్శి వినోద్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ మోడీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని,ఆశా వర్కర్లకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని వారు కోరారు.ఇంకా అనేక రకాల డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు డి మహేశ్వరి,పద్మ,జయమ్మ, ఉమా,అచ్చాలి,శారద,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికాభివృద్ధిలో అసమానతలెన్నో



**వేద న్యూస్, డెస్క్:**

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధి వాపా లేక బలుపా అని బేరీజు వేసుకుని ముందుకుసాగడం ఉత్తమం. ఎందుకంటే ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే భారతదేశ వాస్తవ అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనపడుతున్నది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల' సాధనలో మన దేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహార లోపంలో 111వ స్థానంలో, మహిళా రక్షణ లో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పావర్టీలో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకుకలిగిన ప్రయోజనం ఏమిటి? ఇది మన అందరినీ వెంటాడుతున్న ప్రశ్న. ఈ ప్రశ్నలకు నేటి పాలకులు సమాధానం చెప్పాలి. నేటికి భారత దేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మన దేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒక్క పూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే, తేటతెల్లం అవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మండుతున్నాయి.

ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తున్నది. ఉద్యోగ ఉపాధి అవకాశాలులేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారినా ఎవరికి లాభం? కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామిక వేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి. కార్పొరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి. దేశానికి అన్నం అందించే అన్నదాతలు ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు కనపడటం లేదు. కేవలం నాలుగు రహదారులు, ఆరు విమానాశ్రయాలు, పది పదంతస్థుల ఆకాశహర్మ్యాలు నిర్మించి, యాభై, డెభై అడుగుల విగ్రహాలు, సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరికం తగ్గుతుందా! ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ద్వారా వాస్తవాలు ఎల్లకాలం దాచలేరు. గతంలో 8%, 9% ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతున్నదని గ్రహించాలి. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగానికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఉంది. 'చైనా' వలే స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు ఊబిలో కూరుకు పోకుండా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. కుల, మత, వర్గ, భాష, లింగ వివక్షలు తొలగించడానికి కృషి చేయాలి. అంతేకాని కొందరు బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసిపోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం.

# కేసీఆర్ కళాభారతి పేరులో కేసీఆర్ పేరు తొలగింపు..!

## - పాలకులపై నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే - నల్లమోతు భాస్కర్ రావు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**

మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రం పట్టణ నడిబొడ్డున 10 కోట్ల రూపాయలతో బిఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కళాభారతిని నిర్మించారు.ఈ కేసిఆర్ కళాభారతిని మిర్యాలగూడ నియోజకవర్గ కవులు,కళాకారులు,రచయితలు,సాంస్కృతిక పరులకు అంకితం చేస్తూ,వారి కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సెంట్రల్ ఏసి తో నిర్మించి ఇచ్చారు.ఈ కేసిఆర్ కళాభారతి పేరులో కేసీఆర్ పేరును స్థానిక పాలకుల సూచనతో మున్సిపల్ సిబ్బంది తొలగించడం జరిగింది.ఈ విషయంపై భగ్గుమన్న బారాస శ్రేణులు మాజీ శాసన సభ్యులు నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యములో అదే కేసిఆర్ కళాభారతి వద్ద బైఠాయించి భారీ నిరసన తెలిపారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2006 లో శంకుస్థాపన చేసిన కేసీఆర్ కళాభారతినిన బారాస పాలన వచ్చే వరకు కనీసం 30 శాతం పనులు చేపట్టకుండా నిర్మించి అరకొర పనులు చేసినవి కూడా శిధిలావస్థకు వస్తే ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి దీనిపై దృష్టి పెట్టి పలుమార్లు కేసిఆర్ ని,అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ని కలిసి మన ప్రాంత కళాకారుల పరిస్థితిని వివరించి పూర్తిగా నిర్మాణం చేపట్టి 2023 అక్టోబర్ 2 న కేటీఆర్ మరియు అప్పటి జిల్లా మంత్రి జగదీష్ రెడ్డిలచే ప్రారంబించారు.కాగా ప్రభుత్వం మారినక ప్రస్తుత పాలకులు చేయవలసిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా కూల్చుడు,పేర్లు మార్పు పై ఆలోచిస్తున్నారు. పదేళ్ళు ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఏనాడైన ఇటువంటి చర్యలకు పాల్పడలేదని,ప్రజలకు ఏం కావాలో అది చేసే వారే నాయకులు తప్ప ఇబ్బంది పెట్టె వారు కాదని తెలుసుకోవాలని సూచించారు.దాదాపు 973 కోట్ల



రూపాయలు తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో మంజూరు చేసి టెండర్లు పిలిచి ఉన్నవి,వాటిని పూర్తి చేస్తే చాలని,ఇంకా మిర్యాలగూడ కు ఏం వద్దని హితవు పలికారు. వాటిని సంపూర్ణంగా వాడుకోకుండా అన్నీ నిధులు క్యాన్సిల్ చేసుకుంటూ పోతే పక్క నియోజకవర్గం వారు తీసుకెళ్తుంటే చూస్తూ ఉండడం తప్ప వీళ్ళు ఏమి చేయలేక పోతున్నారని ప్రస్తుత పాలకులను ఉద్దేశించి చెప్పారు.ఆనాడు కేసిఆర్ యాదాద్రి థర్మల్ ప్లాంటు లో 573 మందికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారని, అదే కాకుండా ఒక వెయ్యి మందికి అవుట్ సోర్సింగ్ రూపంలోనో ఇతర మార్గాల ద్వారా మార్గం ఉద్యోగ0 కల్పిస్తామని చెప్పారని,కానీ ఈ పాలకులు హడావిడిగా 116 మందికి ఉద్యోగాలు ఇప్పించి మిగతా వారిని వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అంశాలు ఉన్నాయని తెలిపారు. అనంతర0 మున్సిపల్ కార్యాలయం,సబ్ కలెక్టర్ కార్యాలయం,డిఎస్పీ కార్యాలయాల నందు మెమోరాండం ఇచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,మరలా యధావిధిగా పేరు అమర్చాలని కోరారు..

ఈ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుర్గంపూడి నారాయణ రెడ్డి,యడవెల్లి శ్రీనివాస రెడ్డి, ఎండి. మోషీన్ అలీ,ధనావత్ చిట్టిబాబు నాయక్,బైరం సంపత్,ధనావత్ బాలాజీ నాయక్,పాలుట్ల బాబయ్య,మట్టపల్లి సైదయ్య యాదవ్,ఎండి.మాక్దూమ్ పాషా, అంగోతు హాతీరాంనాయక్, ఎండి.ఇలియాస్ ఖాన్,చిర్ర మల్లయ్య యాదవ్,రాములు గౌడ్,కుర్రా చైతన్య,మహిళా విభాగం నాయకురాళ్ళు పెండ్యాలపద్మ, షెహనాజ్ బేగం,కొదటి రమా,ధనమ్మ,ఉమా,ఎండి. షోయబ్,ఒగ్గు జానయ్య,బారాస నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఘనంగా సన్మానం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఇంటర్మీడియట్ ఫలితాల్లో వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాల్లోని పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులకు, అదేవిధంగా ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టరేట్లో బుధవారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులలో పరీక్షల పట్ల భయం పారద్రోలి ప్రోత్సహించుటకు గాను ప్రత్యేకంగా రూపొందించిన స్ఫూర్తి కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దావత్ ఇస్తానని చెప్పిన క్రమంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవ అభినందన సభలో కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలసి కేక్ కట్ చేసిన అనంతరం విద్యార్థులను జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఇంటర్మీడియట్ టాపర్లు, వారి తల్లిదండ్రులు అసాధారణమైన ప్రతిభ కనబడుచుటకు కష్టపడి సాధించిన లక్ష్యం, అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర నైపు ణ్యం, వ్యక్తిత్వ వికాసంతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం తరపున అందించవలసిన సాయం తప్పకుండా అందిస్తామని పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు ప్రోత్సహిస్తూ వాళ్ళను ఉన్నత శిఖరాలకు చేరుకొనుటకు ప్రోత్సహించాలని అన్నారు.



ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పిల్లలకు భవిష్యత్తులో తీసుకోవలసిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొనుటకు జిల్లాలో రిటైర్డ్ హెడ్మాస్టర్లు, అపార అనుభవం కలిగిన వారితో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించినందున 10వ తరగతి ఉత్తీర్ణత లో గతంలో కంటే మెరుగైన ఫలితాలు తీసుకు రాగలిగామని అన్నారు. చదువుకు ఎప్పటికీ ముగింపు ఉండదని, జీవితంలో పదిమందికి ఉపయోగపడేలా ప్రతి విద్యార్థి పనిచేయాలని అన్నారు. రానున్న భావితరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా విద్యార్థులు నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి డిఇఓ జ్ఞానేశ్వర్, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి వివిధ సంక్షేమ శాఖల అధికారులు విద్యార్థుల , తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# కులగణనతో సామాజిక ఐక్యత బలపడుతుంది

## - బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి

**వేద న్యూస్,ఎన్టీపీసీ జ్యోతినగర్:**

దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణనను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హనుమంతు గౌడ్, పిడుగు కృష్ణ ముదిరాజ్ పాల్గొని సందర్భంగా వారు మాట్లాడారు, "మోదీ సర్కారు తీసుకున్న కులగణన నిర్ణయం దేశంలో సామాజిక సమతుల్యతను బలోపేతం చేస్తుందన్నారు. పారదర్శకతతో నిర్వహించే ఈ గణన, రాజకీయ ప్రయోజనాల కన్నా సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందనీ తెలిపారు. తాము చేపట్టే కులగణన మాత్రం దేశ సామాజిక సమగ్రతను దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు.బీజేపీ ప్రభుత్వం ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టిందనీ తెలిపారు. అదే విధంగా అందరికీ న్యాయం జరిగేలా కులగణన కొనసాగుతుంది. కాంగ్రెస్ పాలిత తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కుల గణన అస్పష్టంగా, రాజకీయ లబ్ధి కోసం జరిగిందని" వారు ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశం సామాజిక, ఆర్థిక పరంగా పటిష్ఠంగా మారుతుందని, మోదీ



ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు కోమల మహేష్, జక్కుల నరహరి, మచ్చ విశ్వాస్, కోడూరు రమేష్, బోడకుంట సుభాష్, మిట్టపల్లి సతీష్ కుమార్, తడగొండ నరసయ్య, మామిడి వీరేశం, దండు పవన్, సుద్దాల సాయి చరణ్, మరియు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల గణన చారిత్రాత్మక నిర్ణయం

**వేద న్యూస్, శాయంపేట:**



దేశవ్యాప్తంగా చేపట్టబోయే జన గణనలో భాగంగా కుల గణనను కూడా నిర్వహించాలని ప్రధానమంత్రి అధ్యక్షతన సిసిపిఏ కీలక నిర్ణయం తీసుకున్న శుభ తరుణంలో బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఇన్నేళ్లు ఈ దేశాన్ని పాలించినటువంటి కాంగ్రెస్ ఏనాడు తీసుకొనటువంటి నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ తీసుకోవడం చాలా హర్షించదగ్గ విషయమని, రాజ్యాంగం లోని ఆర్టికల్ 246 ప్రకారం గణన అనేది కేంద్ర జాబితాలోని 69 అంశంగా ఉందని అందువల్ల జనగణన ,కులగనన బాధ్యత పూర్తిగా కేంద్ర పరిధి అని అన్నారు.రాజకీయ దురుద్దేశం తోటే కావాలనే కొన్ని రాష్ట్రాల్లో తమకు అధికారం లేకపోయినా సర్వేల పేరుతో కులాల లెక్కలు అశాస్త్రీయంగా సేకరించాయని అన్నారు. ఆ సర్వేల వల్ల గందరగోళం ఏర్పడి సమాజంలో చీలికలు రాకూడదు అన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదని అన్నారు.ఈ దేశాన్ని 70 ఏళ్లు పాలించినటువంటి కాంగ్రెస్ కులగనానికి ఎప్పుడు వ్యతిరేకమే అని స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి నిర్వహించిన ఏ జనాభా గననలలో కూడా కులగణను కాంగ్రెస్ ప్రభుత్వాలు చేర్చలేదని,2010 అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కులగణన అంశాన్ని పరిశీలిస్తామని లోక్ సభకు హామీ ఇచ్చారు అన్నారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేస్తే అన్ని పార్టీలు అనుకూలంగా వారి అభిప్రాయాలు తెలిపిన కూడా కులగణన చేయలేదని ప్రతిపక్షాలు ఈ కులగనన అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారని,మన రాష్ట్రంలో సర్వేల పేరుతో కులగణన నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం సరైన లెక్కలను చూపెట్టక తప్పులతడకగా చూపెట్టడానికి ఇదొక నిదర్శనం అని, ఇలాంటి సర్వేలతో కులగణన చేయడం వల్ల సమాజంలో సందేహాలు వస్తాయని ఎద్దేవ చేశారు.ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని దేశంలోని రాజకీయల వల్ల చెడిపోకూడదని అంశంతో ఈ నిర్ణయం తీసుకోవడం ఒక చారిత్రాత్మక నిర్ణయంగా వారు అన్నారు. ఈ కుల గణన వల్ల రేపు దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు బూర ఈశ్వరయ్య, భూతం తిరుపతి, కోమటి రాజశేఖర్, మేకల సుమ, బూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి, కన్నెబోయిన రమేష్, ఎర్ర తిరుపతిరెడ్డి, చిందం గణేష్, బత్తుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, శాయంపేట:**


భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండలంలోని గోవిందా పూర్ గ్రామంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



## ఘనంగా రామానుజాచార్యుల జయంతి

**వేద న్యూస్, మోతే :**

సూర్యాపేట జిల్లా మోతే మండలం సిరికొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామీ వారి దేవాలయంలో శుక్రవారం రామానుజాచార్యులు జయంతిని పురస్కరించుకొని అర్చకులు నరసింహ చార్యుల ఆధ్వర్యములో తనయ విన్నపం, అష్టోత్తరం,మంగళ శాసనం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వేంకటేశ్వర శరణాగతి సభ్యులు యాట వెంకాన,బొంత నవీన్, దుగుంట్ల సైదులు,మమత, అంజమ్మ భక్తులు పాల్గొన్నారు.



## డంపింగ్ యార్డ్‌లో నవజాత శిశువు మృతదేహం!

**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మడికొండ రాంపూర్ గ్రామాల మధ్యలో ఉన్న డంపింగ్ యార్డ్ లో నవజాత మగ శిశువు మృతదేహన్ని శుక్రవారం సుమారు మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో అటువైపుగా వెళ్లిన బైరిలింగమూర్తి, అక్కడే డంపింగ్ యార్డ్ లో పనిచేస్తున్న కార్మికులు నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారని సిఐ పుల్యాల కిషన్ తెలిపారు. ఈ నవజాత మగశిశువు మృతదేహం ఏదైనా హాస్పిటల్ వారు లేదా గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ వేసి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. శిశువు మృతదేహానికి పంచనామ నిర్వహించి, దహన సంస్కారాలు చేశామని సిఐ కిషన్ తెలిపారు.

## కులగణనతో మోదీ చరిత్రలో నిలిచిపోతారు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏనాడు దేశంలో కుల గణన చేపట్టలేదు.బీసీల హక్కులను కాలరాయడం,బీసీల రిజర్వేషన్లను అణచివేయడమే కాంగ్రెస్ చరిత్ర అని ఎస్సీ మోర్చా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శివ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన గణనలో కుల గణనను చేర్చడం ద్వారా ప్రధాని మోదీ ఈ దేశానికి అభినవ అంబేద్కర్‌గా నిలిచారు అని అన్నా రు. శాస్త్రీయ పద్ధతిలో అన్ని కులాల వివరాలు సేకరించి,వారి సంక్షే మం కోసం ప్రణాళికలు రూపొందించాలన్న ఉద్దేశంతో కులగణన చేపట్టనున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ చరిత్రలో నిలిచిపోతారని కీర్తించారు. ఇంకో పది సంవత్సరాలు ఆయనే భారత ప్రధానిగా ఉండి దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ పటంలో వెలుగెత్తి చాటాలని ఆయన ఆకాంక్షించారు.ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలను ఒక తాటిపైకి తేగల ప్రపంచ శక్తివంతమైన లీడర్ నరేంద్ర మోడీ అని కొనియాడారు.

## కుల గణన రాహుల్ గాంధీ ఆలోచన

మొదటి పేజీ తరువాయి

పాదయాత్రలో దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని హామి ఇచ్చారని, ఆ హామి మేరకు తెలంగాణ రాష్ట్రములో బిసి కులగణన చేసి 42శాతం రిజర్వేషన్ లపై అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు కరీముల్లా బేగ్, మాజీ కౌన్సిల్లర్లు పోలగాని బాలు గౌడ్, రాపర్తి శ్రీనివాస్, గందూరి రమేష్, చిరివేళ్ళ శబరి, డీసీసీ కార్యదర్శి నాగుల వాసు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, కాంగ్రెస్ నాయకులు చందా దాసు, బైరు శ్రీనివాస్, సాజిద్, పందిరి మల్లేశ్ , ఊట్కూరి దివ్య , గద్దల శిరీష, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరం

■ గాయం ఉపేందర్ రెడ్డి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



సీఎం సహయ నిధి పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని,నిరుపేదల కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి తెలిపారు.మిర్యాలగూడ మండలం యాద్గర్ పల్లి గ్రామంలో గోగుల దానమ్మ కు రూ.60,000 పగిళ్ళ నాగమణికి రూ.30,000,జనపాటి రేవతికి18,000 రూపాయల చెక్కులను స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశానుసారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డితో కలిసి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా,అత్యధికంగా పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో చెక్కులు మంజూరు చేయించారని అన్నారు. దీనివల్ల నిరుపేదలకు ఎంతో కొంత నీళ్లు దొరుకుతుందని నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలని సీఎంఆర్ చెక్కులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డి వెంకట్ రెడ్డి,గార్లపాటి రమేష్ రెడ్డి,బంటు రామచంద్ర ,నక్క నగేష్,వనం సుదర్శన్,వార్డు మెంబర్లు యాదగిరి,వెంకన్న,చంద్రమౌళి, రామస్వామి,ఆంజనేయులు,ఎడ్ల సురేష్,కారంపూడి రవి,దుండిగల రామకృష్ణ,వస్కుల శేఖర్,గోపి,సురేష్ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అధికారులతో గిరిజనుల అవస్థలు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ వికాస్ యువజన పథకం కొంతమంది అవినీతి అధికారుల అలక్ష్యంతో పక్కదారి పడుతుందని నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ముడావత్ పుట్టంగండి శ్రీనివాస్ నాయక్ విమర్శించారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ వికాస్ దరఖాస్తులు ఆన్లైన్ చేసిన తర్వాత ప్రతి గ్రామపంచాయతీ ప్రతి మండలం, ప్రతి మున్సిపాలిటీ,లో హార్డ్ కాపీలు ఇవ్వమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అయితే కొన్ని ప్రాంతాలలో గిరిజన యువతి యువకులు సంబంధిత కార్యాలయాలకు వెళితే ఆ కార్యాలయాలు మా పరిధిలో లేవని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్నారని ముఖ్యంగా రంగారెడ్డి జోన్ లో సరూర్నగర్ చాలామంది గిరిజన యువతి యువకులు రాజీవ్ వికాస్ కి దరఖాస్తు చేసుకుని ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వం అవినీతి అధికారులపై కన్ను వేసి గిరిజన యువతి యువకులకు న్యాయం చేయాలని లేనియెడల నంగారబెరి లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయవలసి ఉంటుందని శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు.

# వైభవంగా కంచి వరదరాజస్వామి ఆలయ జీర్ణోద్ధరణ

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్ మండలం జగదేవ్ పూర్ సమీపంలోని కంచి వరదరాజాపురంలో కొలువై ఉన్న శ్రీభూ నీల సమేత వరదరాజస్వామి దేవాలయంలో ఆలయ జీర్ణోద్ధరణ నిమిత్తం ఒకటవ తేదీ నుండి 13వ తేదీ వరకు జరిగే కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, స్థానిక సంతోష్ నగర్ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదిగా శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉభయ ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా ప్రొద్దుటూరు నుండి మూల విగ్రహాలు శుక్రవారం ఉదయం వరదరాజపురం చేరుకున్నాయని ఈ నేపథ్యంలో విగ్రహాలను కరకపట్ల, దామరకుంట, వెంకటాపురం, ఎర్రవెల్లి, ఇటిక్యాల, దామరకుంట, జగదేవపురం, నరసన్నపేట, శ్రీనివాసపురం, పీర్లపల్లి మీదగా, శుక్రవారం ఉదయం నుండిశుక్రవారం రాత్రి, వరకు ఊరేగింపు ముగించుకొని వరదరాజపురం దేవస్థానానికి తరలించడం జరిగిందని ఈ నేపథ్యంలో, ప్రతి గ్రామంలో గ్రామస్తులు స్వామి వారి విగ్రహాలకు స్వాగతం పలుకుతూ శాఖ ఆరబోస్తూ స్వామివారి ఆశీస్సులు అందుకున్నారని డాక్టర్ నల్లదిగా శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో దేవాలయానికి వచ్చే భక్తులంతా సాంప్రదాయ దుస్తులలో ఆలయంలో ప్రవేశించే స్వామి వారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# న్యాయవాదుల సంక్షేమం కోసమే బార్ కౌన్సిల్

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



రాష్ట్రంలోని న్యాయవాదుల అందరి సంక్షేమం కోసమే తెలంగాణ బార్ కౌన్సిల్ ఉందని బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కుంచ సునీల్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ గూర్చి కొత్తగా ఎఐబీఈ పాస్ అయినా వారితో పాటు, మిగతా సీనియర్ న్యాయవాదులు కూడా ప్రతి ఐదు సంవత్సరాలు కోసం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. 35 సంవత్సరాలు లోపు గల న్యాయవాదులు అందరూ వెల్ఫేర్ ఫండ్ చెల్లించి భవిష్యత్ లాభలకి అర్హత పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రామ్ దాస్, కోశాధికారి పడిగెల శ్రీనివాస్, కాల్చరల్ కార్యదర్శి యం. సుమలత, అడిషనల్ పిపి చెర్లపల్లి ఆనంద్ గౌడ్, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు నర్సాగౌడ్, శేఖర్, గంగాధర్, గోపి, వెంకటేష్ మరియు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయి..!

మొదటి పేజీ తరువాయి

అందిన దరఖాస్తుల్లో అర్హుల గుర్తింపునకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. నూతన కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా రెవెన్యూ యంత్రాంగం దానిపై దృష్టి సారించారు. నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు,మున్సిపాలిటీలు గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి విచారణ చేపడుతున్నారు. అర్హులను గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నారు. సాగునీటి వసతి కలిగిన భూమి అయితే 3 ఎకరాలు, సాగునీటి వసతి లేనటువంటి అయిదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారు. కుటుంబ సభ్యులు, ఆధార్, మొబైల్ నంబర్, భూమి విస్తీర్ణం, కారు, బైక్ ఉన్నాయా? తదితర వివరాలతో పాటు వారి ఆస్తుల వివరాలను పరిశీలిస్తూ ఫుడ్ సెక్యూరిటీ కార్డు యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఒక కుటుంబానికి అయిదెకరాల భూమి ఉండి యాప్‌లో తక్కువ నమోదైతే పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగా తిరిగి నమోదు చేస్తున్నారు. ఇలాంటి వివరాల ఆధారంగా అనర్హులను ఏరివేస్తున్నారు.సర్వేకు వెళ్లిన రెవెన్యూ ఉద్యోగులకు అర్హుల గుర్తింపులో సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసిన సమయంలో ఆధార్‌కార్డు నంబర్‌కు బదులుగా ఇతరత్రా నంబర్లను నమోదు చేశారు. దీంతో యాప్‌లో ఆధార్‌కార్డును నమోదు చేస్తే అది నమోదు కావడం లేదు. కొంతమంది పాత కార్డుల్లో తమ పేర్లను తొలగించుకోకుండానే కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేశారు. ఇలాంటి వారి వివరాలు సైతం యాప్‌లో అప్‌లోడ్ కావడం లేదు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య తలెత్తడంతో యాప్‌లో వివరాల నమోదుకు ఇబ్బందిగా మారుతున్నట్లు తెలుస్తోంది.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మొదటి పేజీ తరువాయి

అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు.

### నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

విద్యార్ధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్ధులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

## పేదల పక్షాన పోరాడే సిపిఐ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మేడేని శుక్రవారం కూడా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలి,గీసే వాడికే చెట్టు కావాలి అనే నినాదంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిపి 4,500 మంది అమరులైనా మొక్కవోని దీక్షతో పోరాటం జరిపిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి ఉందని వారన్నారు.ఆనాడు పదిలక్షల ఎకరాలు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందని గుర్తు చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073